# ముద్ర

సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

హైదరాబాద్
మంగళవారం, 21.07.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 260
పేజీలు: 06 వెల: రూ. 5


## ఆక్వాను ఆదుకోండి



- సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వండి
- అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం అవసరం
- డీజీఎఫ్‌టీ ద్వారా ఫిష్ మీల్ ఎగుమతి నియంత్రణ
- ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతిని ప్రోత్సహించండి
- ముగ్గురు కేంద్ర మంత్రులకు వేర్వేరుగా సీఎం చంద్రబాబు లేఖలు

02

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య!

ఆఫీస్ బాత్రూంలో విగతజీవిగా

03

- 48 నిమిషాలు పీసీఆర్ అందించిన సిబ్బంది
- పోస్టుమార్టం నివేదిక కోసం వేచి చూస్తున్న అధికారులు



## ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్యాయత్నం

లైంగిక వేధింపుల కేసులో కీలక పరిణామం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉదయ్
- ఎన్‌పీఏ ఘటనలో మరో ట్విస్ట్
- ఆరోపణల మధ్య సూసైడ్ కు యత్నం

02



## సంక్షేమానికి పెద్దపీట..

డిజిటలైజేషన్‌కు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు

02

- పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, ఆరోగ్య భద్రత పథకాలపై సమగ్ర సమీక్ష
- విద్య, వైద్యం, వివాహ సహాయం, బీమా పథకాల బలోపేతానికి ఆదేశం
- పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షలకు ప్రత్యేక ప్రోత్సాహం
- పథకాల అమల్లో పారదర్శకత, డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం
- ప్రతి అర్హుడికి ఫలాలు అందేలా చర్యలు
- డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన క్రికెటర్, డీఎస్పీ సిరాజ్



## కాళేశ్వరం కట్టింది.. కూల్చింది బీఆర్ఎస్

మేడిగడ్డ వైఫల్యానికి బీఆర్ఎస్‌దే బాధ్యత: ఉత్తమ్

- అనుమతుల తర్వాతే బ్యారేజీల పునరుద్ధరణ
- అసురక్షిత బ్యారేజీల్లో నీటి నిల్వకు నో
- శాస్త్రీయ నివేదికల ఆధారంగానే మరమ్మతులు
- ప్రజల ప్రాణాలతో రాజకీయం చేయబోమన్న ఉత్తమ్

02



## మోసం చేసిన కాంగ్రెస్

కే. తారక రామారావు



- ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?
- రుణమాఫీపై రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- పోచారాన్ని ఓడించాలని కేటీఆర్ పిలుపు

02

## బిగ్ బాస్ 10 వచ్చేస్తోంది

సెప్టెంబర్‌లో గ్రాండ్ లాంచ్..

02




- తెలుగు హోస్ట్‌గా మరోసారి నాగార్జున
- బుల్లితెరపై మళ్లీ మొదలైన సందడి

## ఢిల్లీపై బొద్దింకల దండయాత్ర

పేపర్ లీక్‌లపై యువత ఆగ్రహం.. ఢిల్లీలో ఉద్రిక్తత

- పార్లమెంట్ ముట్టడితో దేశ దృష్టిని ఆకర్షించిన సీజేపీ
- లాఠీచార్జ్, టియర్ గ్యాస్ మధ్య కొనసాగిన నిరసనలు
- విద్యా వ్యవస్థలో సంస్కరణలే ప్రధాన డిమాండ్
- పేపర్ లీక్‌లపై కేంద్రాన్ని నిలదీసిన నిరసనకారులు
- బ్యారికేడ్లు దాటి పార్లమెంట్ వైపు దూసుకెళ్లిన ఆందోళనకారులు
- పరీక్షల పారదర్శకత కోసం గళమెత్తిన వేలాది మంది
- యువత ఆవేదనకు ఢిల్లీ వేదికైంది
- ఆందోళనలపై అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ
- నిరసనకారులతో కేంద్రమంత్రుల వరుస భేటీలు




**ముద్ర, న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పరీక్షాపత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థలోని లోపాలపై యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పేపర్ లీక్‌లకు నిరసనగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' ఉద్రిక్తతకు దారితీసింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, నిరసనకారులు బ్యారికేడ్లను బద్దలు కొడుతూ పార్లమెంట్ వైపు దూసుకెళ్లారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడంతో జంతర్ మంతర్ పరిసర ప్రాంతాలు రణరంగంగా మారాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో తక్షణమే పారదర్శక సంస్కరణలు తీసుకురావాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. కేవలం బలప్రయోగంతో నిరసనలను అణచలేరని, వ్యవస్థను ప్రక్షాళన చేయడం ద్వారానే విద్యార్థుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించగలరని ఈ నిరసనలు స్పష్టం చేస్తున్నాయి. ఆందోళనలపై హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ అయ్యారు. అనంతరం నిరసనకారులతో కేంద్రమంత్రుల వరుస భేటీలు జరిపి శాంతిపరిచే ప్రయత్నాలు జరిపారు. మిగతా 03లో



## తాగునీటికి కట కట

నగర రోడ్లపై 18వేల ట్యాంకర్లు

- బుక్ చేస్తే రోజులకొద్దీ వెయిటింగ్
- సిటీలో భూగర్భ జలాలు అట్టడుగుకు
- వట్టిపోయిన బోర్లు.. చుక్క రాని నీరు
- హైదరాబాద్ ప్రజలకు ట్యాంకర్లే దిక్కు
- అస్తవ్యస్తంగా తాగునీటి సమస్య
- గోదావరి, కృష్ణా జలాలు లిఫ్ట్ చేయకపోవడమే కారణం
- తాగునీటికి తల్లడిల్లుతున్న భాగ్యనగరం

**ముద్ర, హైదరాబాద్:** భాగ్యనగరం తీవ్ర తాగునీటి సంక్షోభంతో అల్లాడుతోంది. ఒకప్పుడు బోర్లు, మున్సిపల్ నీటిపైనే ఆధారపడిన నగరవాసులు ఇప్పుడు పూర్తిగా వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల క్షీణత, గోదావరి–కృష్ణా జలాల సరఫరాలో అంతరాయాలు కలిసి హైదరాబాద్‌ను ఎన్నడూ లేని నీటి కష్టాల్లోకి నెట్టాయి. నగరంలో దాదాపు 18 వేలకుపైగా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లు నిరంతరం తిరుగుతున్నా డిమాండ్‌కు సరిపోవడం లేదు. ట్యాంకర్ బుక్ చేస్తే ఒకటి, రెండు రోజులు కాదు.. కొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

**వట్టిపోయిన బోర్లు.. లక్షల రూపాయలు వృథా**

కూకట్‌పల్లికి చెందిన రమేష్ నాలుగేళ్ల క్రితం 1,000 అడుగుల లోతులో బోరు వేయించగా అప్పట్లో సమృద్ధిగా నీరు లభించింది. మిగతా 02లో

## హైదరాబాద్ పేదలకు బిగ్ ఆఫర్

- CUREలో పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం
- రూ.6 లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి అర్హత.
- 26 నియోజకవర్గాల్లో తొలి విడత పనులు ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కల కంటున్న అల్పాదాయ వర్గాలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ఉన్న కోర్ అర్బన్ రీజియన్ లోని 26 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పేదల కోసం ఏకంగా ఒక లక్ష నూతన గృహాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న పట్టణీకరణ, పేదల ఆవాస అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ సమగ్ర గృహ నిర్మాణ బృహత్ ప్రణాళిక శంకుస్థాపనకు జూలై 20న అడుగులు పడ్డాయి. ఈ మెగా ప్రాజెక్టును దశలవారీగా వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.
మిగతా 02లో





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 21.07.2026
www.mudranews.in | @mudranews





వర్షాకాలంలో పాటించాల్సిన టాప్ 7 చిట్కాలు

మరిగించిన నీటినే తాగండి – కలుషిత నీటితో వచ్చే వ్యాధులను నివారించేందుకు శుభ్రమైన నీటినే ఉపయోగించండి.

# తాగునీటికి కట కట



(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఆ బోరు పూర్తిగా ఎండిపోయింది. దీంతో మరోసారి 1,200 అడుగుల లోతు వరకు బోరు వేయించేందుకు భారీగా ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదు. అల్విన్ కాలనీకి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంటి నిర్మాణం కోసం రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాదాపు వెయ్యి అడుగుల లోతు వరకు బోర్లు వేయించినా చుక్క నీరు పడలేదు. ఇందుకోసం ఖర్చు చేసిన లక్షల రూపాయలు నేలపాలయ్యాయి. ఇప్పుడు మరింత లోతులో మరో బోరు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితి ఇద్దరిదే కాదు.. నగరవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఇదే సమస్య ఎదుర్కొంటున్నాయి.

**ట్యాంకర్లే దిక్కు**

గ్రేటర్ హైదరాబాద్‌లో తాగునీటి అవసరాల్లో గణనీయమైన భాగం ఇప్పుడు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారానే తీరుతోంది. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, వాణిజ్య సముదాయాలు రోజువారీగా ట్యాంకర్లపై ఆధారపడుతున్నాయి. దీంతో నగరంలోని ప్రధాన రహదారులపై ఎక్కడ చూసినా వాటర్ ట్యాంకర్లు పరుగులు తీస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

**మిషన్ భగీరథకూ నీటి కొరత**

భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు మిషన్ భగీరథకు అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. నగర జనాభాకు అనుగుణంగా గోదావరి, కృష్ణా నదుల నుంచి నీటిని పూర్తిస్థాయిలో లిఫ్ట్ చేసి సరఫరా చేయడంలో జాప్యం ఏర్పడటంతో తాగునీటి ఎద్దడి మరింత పెరిగిందని నిపుణులు చెబుతున్నారు.

**ఆందోళనలో నగరవాసులు**

ఎండలు మరింత తీవ్రం కావడంతో భూగర్భ జలాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. ఇప్పటికే వందలాది బోర్లు ఎండిపోగా, కొత్తగా వేస్తున్న బోర్లలోనూ నీరు పడకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ట్యాంకర్ల ధరలు పెరగడం, సరఫరా ఆలస్యం కావడం వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

**తక్షణ చర్యలకు డిమాండ్**

నగరానికి గోదావరి, కృష్ణా జలాల సరఫరాను అత్యవసరంగా పెంచాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావాలని, భూగర్భ జలాల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు, నిపుణులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకపోతే రానున్న రోజుల్లో హైదరాబాద్‌లో తాగునీటి సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్యాయత్నం

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపులు, దాడి చేసినట్లు వచ్చిన ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయనను ఎర్రగడ్డలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.కర్నాటకకు చెందిన 30 ఏళ్ల వివాహిత ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెకు అసభ్యకర సందేశాలు పంపుతూ వేధించడంతో పాటు గదిలోకి లాక్కెళ్లి జుట్టు పట్టుకుని గొంతు నులిమి, మెడపై కత్తిపెట్టి బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే బాధితురాలి వ్యక్తిగత వీడియోను రికార్డు చేసి ఆమె భర్తకు పంపుతూ బ్లాక్‌మెయిల్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహితలోని పలు తీవ్రమైన సెక్షన్లతో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, NPA ప్రివిలేజ్ కమిటీ సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలించి ఆరోపణలు నిజమని నిర్ధారించడంతో ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. పోలీసులు నోటీసులు జారీ చేయగా, తనకు ఎలాంటి తప్పు లేదంటూ ఉదయ్ కృష్ణారెడ్డి ఇన్ స్టా స్టేటస్‌లో పేర్కొన్నట్లు సమాచారం.

ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ జర్నీ కూడా తెలుగు రాష్ట్రాల్లో చాలామందికి ఆదర్శంగా నిలిచిన వ్యవహారం. సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామానికి చెందిన ఉదయ్.. తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ కూలిపనులు చేసి తెచ్చే డబ్బుతోనే వారి జీవనం సాగింది. ఆ కసితోనే 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అయితే ఓ సీఐ తోటివారి ముందు అవమానించడంతో.. 2018లో ఉద్యోగానికి రిజైన్ చేసి.. సివిల్స్ బరిలోకి దిగాడు. నాలుగుసార్లు విజయం దక్కకపోయినా.. పట్టుదలతో ఐదోసారి 360 ర్యాంకు సాధించాడు. త్వరలో పూర్తి స్థాయి పోలీస్ అధికారిగా బాధ్యతలు చేపట్టాల్సిన అతను.. ఇప్పుడు ఇలా ఆరోపణలతో ఆత్మహత్యాయత్నం వరకు వచ్చాడు.

# ఆక్వాను ఆదుకోండి

**ముద్ర, అమరావతి:** జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్ ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీ దారులకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాశారు. రొయ్యల మేత తయారీలో ప్రధాన ముడిసరుకైన సోయాబీన్ మీల్ ధరలు విపరీతంగా పెరగడంతో, మేత తయారీ ఖర్చులు పెరిగాయని వివరించారు. దీనివల్ల రొయ్యల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీఎం స్పష్టం చేశారు. దేశంలో రొయ్యల మేత కొరతను తీర్చేందుకు, ధరల నియంత్రణకు సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2021లోనూ రొయ్యల మేత తయారీదారులకు పరిమిత స్థాయిలో దిగుమతి చేసుకునేందుకు అనుమతులిచ్చారని లేఖలో పేర్కొన్నా రు. ఈక్వెడార్ నుంచి పెరిగిన రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా, చైనా, యూరోప్ లాంటి ప్రధాన మార్కెట్లలో భారతీయ రొయ్యల ఎగుమతులు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖలో వివరించారు. జన్యుమార్పిడి చేసిన సోయాబీన్‌ను వ్యవసాయానికి, విత్తన ఉత్పత్తికి వినియోగించే అవకాశం లేదని తద్వారా జీవ వైవిధ్యానికి దేశీయ వంగడాలకు ముప్పు లేదని సీఎం వివరించారు. ప్రభుత్వం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇస్తే రొయ్యల మేత పరిశ్రమకు నాణ్యమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుందని సీఎం స్పష్టం చేశారు. లక్షలాది మంది రొయ్యల రైతులు, కార్మికులకు ఉపాధి కలుగుతుందని, తద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందన్నారు.

**బ్లూ ఎకానమీకి సహకారం ఇవ్వండి**

ఆంధ్రప్రదేశ్ లో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో మంత్రిని కోరారు. ఈ ఏడాది జూన్ 5 తేదీ విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్ షాప్ లో అమరావతిలో ఎన్ఎఫ్ డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.

**డీజీఎఫ్‌టీ ద్వారా క్రమబద్ధీకరించండి**

ఆంధ్రప్రదేశ్ లోని అక్వా కల్చర్ రంగాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య మంత్రిని సీఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్ లో ఉపయోగించే చేప పొడిని 5 శాతం ప్రోత్సాహకాలతో ఎగుమతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీ దారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా ఎగుమతులను నియంత్రించాలన్నారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీ దారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలన్నారు.

నిర్యాత్ ప్రోత్సాహన్ పథకం వర్తింప చేయాలి ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహదపడుతోందని సీఎం వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సీవీ పొగాకు 70 శాతం మేర ఎగుమతి అవుతోందని సీఎం వెల్లడించారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ (RoDTEP) పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చినప్పటికీ... ప్రాసెస్ చేయని పొగాకును (HS Code 2401) మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. సమాన వడ్డీ పథకం, నిర్యాత్ ప్రోత్సాహన్ లాంటి పథకాల కింద ఎఫ్‌సీవీ పొగాకుకు సబ్సిడీ లేకపోవటంతో ఎగుమతిదారులకు భారం పడుతోందని సీఎం వివరించారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు (HS Code 2401-2401 10, 2401 20,2401 30) రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు RoD-TEP పథకం కింద ప్రయోజనాలు వర్తింపజేయాలని సీఎం కోరారు.

**కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వండి**

ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకునేలా ఆక్వా కల్చర్ ఏరియేటర్లపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. కేంద్ర మంత్రికి లేఖ రాసిన సీఎం భారత- అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆక్వా దిగుమతులపై సుంకం 10 శాతానికి తగ్గినా ఇంకా చట్టపరమైన అనిశ్చితి కొనసాగుతోందని టారిఫ్ సంక్షోభంపై కేంద్ర ఆర్థిక శాఖ జోక్యం చేసుకోవాలని సీఎం కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు పై రూ.5 లక్షల వరకూ వన్ టైమ్ టాప్ అప్ ఇవ్వాలని సీఎం కేంద్ర ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. దేశీయ మార్కెటింగ్ కోసం ఎన్ఎఫ్‌డీబీ ద్వారా రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించేందుకు రొయ్య ఎగుమతులను పెంచేలా సబ్సిడీలు ఇవ్వటంతో పాటు సామర్థ్యాలను పెంచేలా చూడాలని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. అలాగే ప్రాసెస్ చేయని పొగాకు హెచ్ఎస్ఎన్ కోడ్ 2401 పై జీఎస్టీని 40 నుంచి 28 శాతానికి తగ్గించాలని సీఎం కోరారు.

## పోలీసు సంక్షేమానికి పెద్దపీట

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే శాఖ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, ఆరోగ్య భద్రత పథకాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షలకు ప్రత్యేక ఆర్థిక సహాయం, తక్కువ వడ్డీతో గృహ, విద్య, వ్యక్తి గత రుణాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య భద్రత పథకం ద్వారా వేలాది మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కోసం పూర్తి స్థాయి డిజిటలైజేషన్ చేపట్టాలని, ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ స్పష్టం చేశారు. అలాగే సంక్షేమ నిధుల దుర్వినియోగాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్, డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం. భగవత్, ఏడీజీ సంజయ్ జైన్, ఐజీ (మల్టీజోన్-2) షహనవాజ్ ఖాసిం, ఐజీ (ప్రొవిజన్ అండ్ లాజిస్టిక్స్) గజరావు భూపాల్, పోలీస్ వెల్ఫేర్, ఆరోగ్య భద్రత కార్యదర్శి ఉదయ్ కుమార్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ కుమార్, తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు గోపీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## కాళేశ్వరం కట్టింది.. కూల్చింది కూడా బీఆర్ఎస్

**ముద్ర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణం, నిర్వహణతో పాటు మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కూడా పూర్తి బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. అసురక్షితమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేయడం ప్రమాదకరమని, ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీతో పాటు నిపుణుల అనుమతులు వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పను లు చేపడతామని స్పష్టం చేశారు. శాస్త్రీయ పరీక్షలు, ఐఐటీ బాంబే సూచనల మేరకే మరమ్మతులు పూర్తి చేసి బ్యారేజీలను వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.



## బిగ్ బాస్ 10 వచ్చేస్తోంది..

**ముద్ర డెస్క్:** దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన రియాలిటీ షో బిగ్ బాస్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిగ్ బాస్ తెలుగు సీజన్-10 సెప్టెంబర్‌లో గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని జియో స్టార్ అధికారికంగా ప్రకటించింది. విశేషమేమిటంటే, ఈసారి కేవలం తెలుగు మాత్రమే కాకుండా హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, బంగ్లా భాషల్లో ప్రసారమయ్యే బిగ్ బాస్ షోలను కూడా దాదాపు ఒకేసారి ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.

తెలుగు బిగ్ బాస్ 10లో పాల్గొనే కంటెస్టెంట్ల ఎంపిక ఇప్పటికే చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. సినీ, టెలివిజన్, సోషల్ మీడియా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ సీజన్‌లో కనిపించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. అయితే అధికారిక కంటెస్టెంట్ల జాబితాను షో ప్రారంభానికి కొద్ది రోజుల ముందు నిర్వాహకులు వెల్లడించే అవకాశం ఉంది.

ప్రతి ఏడాది కొత్త టాస్కులు, వినూత్న కాన్సెప్ట్లు, అనూహ్య ట్విస్టులతో ప్రేక్షకులను అలరించే బిగ్ బాస్.. ఈసారి 10వ సీజన్ కావడంతో మరింత గ్రాండ్‌గా ఉండేలా నిర్వాహకులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న ఈ షో కోసం ఇప్పటికే బిగ్ బాస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# హైదరాబాద్ పేదలకు బిగ్ ఆఫర్

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా మొదటి విడత కింద ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. భూముల కొరతను అధిగమించడంతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు కల్పించేందుకు గాను, సాంప్రదాయ ఇళ్లకు భిన్నంగా వర్టికల్ గ్రోత్ మోడల్‌లో 10 అంతస్తుల మోడర్న్ రెసిడెన్షియల్ టవర్లను నిర్మించనున్నారు. ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఈ కమ్యూనిటీల్లో విశాలమైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, లిఫ్ట్ సదుపాయాలతో పాటు విద్యుత్ అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.

**రూ.6 లక్షల కన్నా తక్కువ సంపాదించే వారు**

ఈ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వం పారదర్శకమైన, కఠినమైన నిబంధనలను ఖరారు చేసింది. వార్షికాదాయం రూ. 6 లక్షల లోపు ఉన్న కుటుంబాలు మాత్రమే ఈ గృహాల కేటాయింపునకు అర్హులు . దీంతో పాటు తెలంగాణ పరిధిలో ఇప్పటివరకు ఏ ప్రాంతంలోనూ సొంతంగా పక్కా ఇల్లు లేదా ప్లాట్ లేని నిరుపేద కుటుంబాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో డిజిటల్ సర్వేల ద్వారా సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనున్నారు.

**ఇప్పటికే స్థల పరిశీలనలు పూర్తి**

పట్టణాల్లో గుడిసెలు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న కార్మికులు, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు శాశ్వత నివాస యోగ్యమైన ఇళ్లను అందించడమే లక్ష్యంగా గృహ నిర్మాణ శాఖ రంగంలోకి దిగింది. నియోజకవర్గానికి తొలిదశలో కేటాయించిన 500 ఇళ్లకు సంబంధించిన స్థల సేకరణ, ల్యాండ్ బ్యాంక్ ఐడెంటిఫికేషన్ ప్రక్రియలను కూడా అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. హెచ్ఎండీఏ, హౌసింగ్ బోర్డు , స్థానిక పురపాలక వర్గాలు సమన్వయంతో పర్యవేక్షిస్తున్నాయి.

గతంలో ఇళ్ల కేటాయింపుల్లో ఎదురైన ఆలస్యాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణతో నిర్ణీత గడువులోగా టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, లబ్ధిదారులకు తాళాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో రాబోయే రోజుల్లో CURE ప్రాంతం ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అక్కడ పేదలకు పక్కా ఇల్లు కల్పించడం వల్ల వారి జీవన ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



## అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది

**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని.. పనులు మాత్రం గడప కూడా దాటడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. చేశారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్నివర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాటతప్పారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారంతోపాటు కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.



"కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి.. మోటార్లు కాలిపోతున్నాయి. రైతులకు యూరియా అందించలేకపోతున్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు అన్నీ ఇళ్ల వద్దకే వచ్చేవి. రూ. 2లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. కేసీఆర్ హయాంలో 11 సా ర్లు రైతుబంధు వేశారు. కాళేశ్వరంపై మాట్లాడినవన్నీ అబద్ధాలే అని ప్రజలకు తెలిసిపోతుందనే రేవంత్ నీళ్లు వదలడం లేదు. మేడిగడ్డ బ్యారేజ్‌లో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు ఎందుకు చేయలేదు? ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందే శాస్త్రవేత్తలు చెబితే.. ప్రభుత్వం ఇప్పుడు సమీక్షలు చేస్తోంది. సరైన ప్రణాళిక లేకుండా సీఎం పనిచేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

### వర్షా కాలంలో పాటించాల్సిన చిట్కాలు



వేడివేడిగా వండిన ఆహారమే తినండి – బయట ఆహారం, నిల్వ చేసిన పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండండి.

# ఢిల్లీపై 'బొద్దింకల' దండయాత్ర



**పేపర్ లీక్‌లపై యువత ఆగ్రహం.. ఢిల్లీలో ఉద్రిక్తత.**
**పార్లమెంట్ మార్చ్‌తో దేశ దృష్టిని ఆకర్షించిన సీజేపీ.**
**లాఠీచార్జ్, టియర్ గ్యాస్ మధ్య కొనసాగిన నిరసనలు.**
**విద్యా వ్యవస్థలో సంస్కరణలే ప్రధాన డిమాండ్.**
**పేపర్ లీక్‌లపై కేంద్రాన్ని నిలదీసిన నిరసనకారులు.**
**బ్యారికేడ్లు దాటి పార్లమెంట్ వైపు దూసుకెళ్లిన ఆందోళనకారులు.**
**రాజీనామాతో కాదు.. సంస్కరణలతోనే పరిష్కారం.**
**నిరసన హక్కు వర్సెస్ భద్రత.. ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితి.**
**పరీక్షల పారదర్శకత కోసం గళమెత్తిన వేలాది మంది యువత ఆవేదనకు ఢిల్లీ వేదికైంది.**

**ముద్ర, న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ మరోసారి భారీ నిరసనలకు వేదికైంది. పరీక్షా పత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవ్యవస్థపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీజేపీ (కాక్రోచ్ జనతా పార్టీ) ఆధ్వర్యంలో చేపట్టిన పార్లమెంట్ మార్చ్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉదయం కురిసిన వర్షం కూడా వేలాది మంది నిరసనకారుల సంకల్పాన్ని అడ్డుకోలేకపోయింది. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు కదిలిన యువత, విద్యార్థులు, మద్దతుదారులను పోలీసులు బ్యారికేడ్లు, లాఠీచార్జ్, టియర్ గ్యాస్‌తో అడ్డుకునేందుకు ప్రయత్నించినా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటన కేవలం ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన కార్యక్రమంగా కాకుండా, దేశ యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది.



పరీక్షా పత్రాల లీకులు గత కొన్నేళ్లుగా దేశ వ్యాప్తంగా తీవ్రమైన సమస్యగా మారాయి. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకులు వారి భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. ఒకసారి పరీక్ష రద్దయితే మళ్లీ నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి వస్తోంది. ఉద్యోగాలు ఆలస్యం అవుతున్నాయి. కుటుంబాలపై ఆర్థిక, మానసిక భారం పెరుగుతోంది. ఇలాంటి సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన, శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమైందనే భావన విద్యార్థుల్లో బలపడుతోంది.

ఈ నేపథ్యంలో పార్లమెంట్ మార్చ్‌కు వేల సంఖ్యలో ప్రజలు తరలిరావడం సాధారణ రాజకీయ నిరసనగా చూడలేం. పోలీసుల హెచ్చరికలు, భారీ భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ నిరసనకారులు వెనక్కి తగ్గకపోవడం వారి ఆవేదన తీవ్రతను సూచిస్తోంది. బ్యారికేడ్లను తొలగించే ప్రయత్నాలు, చెట్లు, సిగ్నల్ స్తంభాలు ఎక్కి ముందుకు సాగాలనే తపన, పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సిన పరిస్థితి ఏర్పడటం ఢిల్లీలో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది. లాఠీచార్జ్‌లో పలువురు గాయపడడం, కొందరు స్పృహ తప్పి ఆసుపత్రులకు తరలించబడటం పరిస్థితి ఎంత తీవ్రంగా మారిందో తెలియజేస్తోంది.

ఇక్కడ మరో కీలక అంశం ప్రజాస్వామ్య హక్కుల ప్రశ్న. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించింది. అదే సమయంలో శాంతిభద్రతలు కాపాడటం పోలీసుల బాధ్యత. ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటించడంలో ప్రతి ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. అధిక బలప్రయోగం ప్రజల్లో మరింత అసంతృప్తిని పెంచే ప్రమాదం ఉంది. మరోవైపు నిరసన పేరుతో హింసాత్మక చర్యలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కూడా సమర్థనీయం కాదు. ప్రజాస్వామ్యంలో ఆవేదనకు స్వరం ఉండాలి, కానీ ఆ స్వరం హింసగా మారకూడదు.

సీజేపీ ప్రధాన డిమాండ్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది. అయితే రాజీనామా మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెరగాలి. ప్రశ్నపత్రాల భద్రతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి. డిజిటల్ సెక్యూరిటీ వ్యవస్థలను బలోపేతం చేయాలి. పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై వేగవంతమైన విచారణ జరిపి కఠిన శిక్షలు అమలు చేయాలి. అలాగే పరీక్షల నిర్వహణకు బాధ్యత వహించే సంస్థల్లో నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడం అత్యవసరం.

ఈ అంశంపై పార్లమెంట్‌లో కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రయత్నించాయి. ప్రభుత్వం ఈ నిరసనను కేవలం రాజకీయ విమర్శగా కాకుండా విద్యార్థుల ఆందోళనగా గుర్తించి స్పందించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే విద్యార్థుల విశ్వాసం కోల్పోయిన విద్యా వ్యవస్థ ఏ దేశానికీ మేలు చేయదు. యువత ఆశలు, ఆకాంక్షలు, భవిష్యత్తు దేశ అభివృద్ధికి పునాది. వారి సమస్యలను నిర్లక్ష్యం చేయడం అంటే దేశ భవిష్యత్తునే నిర్లక్ష్యం చేసినట్టే.

ఢిల్లీ వీధుల్లో మార్మోగిన ఈ నిరసన ఒక రోజు వార్తగా ముగిసిపోవచ్చు. కానీ దాని వెనుక ఉన్న అసలు సందేశాన్ని పాలకులు అర్థం చేసుకోవాలి. పేపర్ లీకులు, అవినీతి, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు పునరావృతం కాకుండా వ్యవస్థను సంస్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. నిరసనలు తగ్గించాలంటే బలప్రయోగం కాదు, నమ్మకాన్ని పునరుద్ధరించే నిర్ణయాలే నిజమైన పరిష్కారం.

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య

**ఆఫీస్ బాత్రూంలో డీజీపీ మృతి**
**ఆత్మహత్యగా ప్రాథమిక అనుమానం**
**పోస్టుమార్టం నివేదిక కోసం వేచి**
**48 నిమిషాల సీపీఆర్ ఫలించలేదు**
**దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**ముద్ర , న్యూ ఢిల్లీ :** త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అగర్తలా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆఫీస్ బాత్రూంలో అపస్మాకర స్థితిలో ఉన్న ఆయన్ను గుర్తించిన సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు సమాచారం. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి మాణిక్ సాహా డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. అనురాగ్ ధన్‌ఖడ్ 1994 బ్యాచ్‌కు చెందిన త్రిపుర క్యాడెర్ ఐపీఎస్.

డీజీపీ మృతిపై ఆసుపత్రి సీనియర్ వైద్యుడు మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న అనురాగ్ ధన్‌ఖడ్‌ను తీసుకొచ్చారని అన్నారు. వెంటనే డ్యూటీలో ఉన్న వైద్యులు పరిశీలించగా.. అప్పటికే పల్స్ పడిపోయిందని చెప్పారు. దాదాపు 48 నిమిషాల పాటు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే ఎలా మృతి చెందారన్నదానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఉరివేసుకున్న ఆనవాళ్లేమైనా కనిపించాయా? అని విలేకరులు ప్రశ్నించగా.. నివేదిక వచ్చిన తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని మాట దాటవేశారు. మరోవైపు డీజీపీ మృతితో సీనియర్ పోలీసు అధికారులంతా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. సంఘటన స్థలిలో ఆధారాలను సేకరించి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

### కరీంనగర్ డెయిరీ చైర్మన్ సి.హెచ్. రాజేశ్వర్‌రావుకు
## అమెరికా డాక్టరేట్



పాల విప్లవానికి అంతర్జాతీయ గుర్తింపు..

**ముద్ర, కరీంనగర్ :** తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తి చేసే రైతుల ఆర్థిక సాధికారత, సహకార డెయిరీ రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (కరీంనగర్ డెయిరీ) చైర్మన్ సి.హెచ్. రాజేశ్వర్‌రావుకు అమెరికాలోని మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ (USA) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పాడి పరిశ్రమలో ఆయన అందించిన విశేష సేవలు, రైతుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం లభించింది. న్యూఢిల్లీలోని లోధి రోడ్‌లో ఉన్న ఇండియా హ్యాబిటాట్ సెంటర్లోని గుల్మోహర్ హాల్లో జూలై 19న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై రాజేశ్వర్‌రావును అభినందించారు.

**రైతు సంక్షేమమే లక్ష్యంగా...**

వ్యవసాయ పట్టభద్రుడైన రాజేశ్వర్‌రావు, రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను స్థిరమైన అదనపు ఆదాయ వనరుగా తీర్చిదిద్దేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. శాస్త్రీయ పద్ధతుల్లో పాల ఉత్పత్తి, పశుసంవర్ధకంపై అవగాహన కల్పించడం, పాల ఉత్పత్తిదారులకు మెరుగైన ధరలు అందేలా చర్యలు తీసుకోవడం, సహకార వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయన విశేషంగా కృషి చేశారు.

**తెలంగాణలో అగ్రగామిగా కరీంనగర్ డెయిరీ**

రాజేశ్వర్‌రావు నాయకత్వంలో కరీంనగర్ డెయిరీ తెలంగాణలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన సహకార డెయిరీ సంస్థగా గుర్తింపు పొందింది. పాలు, పాల ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, విక్రయాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అనేక కొత్త పాల ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చి సంస్థ మార్కెట్ పరిధిని విస్తరించారు. ప్రస్తుతం లక్ష మందికి పైగా రైతులు కరీంనగర్ డెయిరీకి ప్రతిరోజూ పాలను సరఫరా చేస్తున్నారు.

**12 వేల లీటర్ల నుంచి 3 లక్షల లీటర్ల సామర్థ్యానికి...**

1971లో కేవలం 12 వేల లీటర్ల పాల ప్రాసెసింగ్ సామర్థ్యంతో ప్రారంభమైన కరీంనగర్ డెయిరీ, నేడు నుస్తులాపూర్ మండలం నల్లగొండ గ్రామంలోని అత్యాధునిక మెగా డెయిరీతో రోజుకు 3 లక్షల లీటర్లకు పైగా పాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని చేరుకుంది. రైతుల సంక్షేమం, పాడి పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంపు కోసం అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం ద్వారా కరీంనగర్ డెయిరీతో పాటు తెలంగాణ పాడి పరిశ్రమకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించిందని రైతులు, డెయిరీ వర్గాలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు సంక్షేమం కోసం రాజేశ్వర్‌రావు చేసిన కృషికి ఈ గౌరవం నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## దుబాయ్‌లో ఘనంగా బోనాల మహోత్సవం..

**ముఖ్య అతిథిగా కొత్త జైపాల్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవంను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ETCA) ఆధ్వర్యంలో జూలై 19, 2026న యూఏఈలోని రాస్ అల్ ఖైమా – మైత్రి ఫార్మ్స్‌ల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు మైత్రి గ్రూప్ వ్యవస్థాపకులు కొత్త జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.దుబాయ్, అబుదాబి, షార్జా, అజ్మాన్, ఉమ్ అల్ ఖువైన్, రాస్ అల్ ఖైమా, ఫుజైరా తదితర ఎమిరేట్స్ నుంచి సుమారు 400 మంది తెలంగాణ ప్రవాసులు కుటుంబ సమేతంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. విదేశీ నేలపై తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ బోనాల వేడుకను ETCA వరుసగా నాలుగో ఏడాది నిర్వహించడం విశేషం.కార్యక్రమం గౌరమ్మ పూజతో ప్రారంభమై, శ్రీ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, దీపప్రజ్వలనం, బోనాల సమర్పణ, కుంకుమార్చన, అష్టోత్తర శతనామార్చన, మహాహారతులతో ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. మహిళలు సంప్రదాయ పట్టు చీరలు ధరించి రంగురంగుల పూలతో అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ నిర్వహించిన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. ఒగ్గు డోలు మోతలు, పోతురాజుల విన్యాసాలు, జానపద కళారూపాలు ఎడారి నేలపై తెలంగాణ పల్లె వాతావరణాన్ని సృష్టించాయి.ముఖ్య అతిథిగా కొత్త జైపాల్ రెడ్డిఈ కార్యక్రమానికి మైత్రి గ్రూప్ వ్యవస్థాపకులు శ్రీ కొత్త జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ETCA సభ్యులను అభినందించారు. విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సేవా కార్యక్రమాలతో పాటు బోనాలు, బతుకమ్మ వంటి పండుగలను ఘనంగా నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్న తీరు ప్రశంసనీయమని ఆయన అన్నారు. విదేశీ నేలపై తెలంగాణ ఆత్మను సజీవంగా నిలుపుతున్న సంస్థగా ETCA చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.



**ETCA లక్ష్యం – భావితరాలకు తెలంగాణ సంస్కృతి పరిచయం**

ETCA వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్ రావు మాట్లాడుతూ.. యూఏఈలో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులకు, ముఖ్యంగా విదేశాల్లో జన్మించిన పిల్లలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల గొప్పతనాన్ని పరిచయం చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఏడాది మరింత వైభవంగా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తూ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన LSPMK గ్రూప్ చైర్మన్ రాధారపు సత్యం, ఫోటోగ్రఫీ, వీడియో సేవలు అందించిన లెమన్ స్టూడియో రమేశ్, విరాళాలు అందించిన సభ్యులు, వాలంటీర్లు, కళాకారులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం నిర్వహించిన దీపోత్సవం, సామూహిక హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగిసిన తర్వాత భక్తులందరికీ మహాప్రసాదం పంపిణీ చేసి, సంప్రదాయ తెలంగాణ వంటకాలతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విదేశాల్లో ఉన్నామనే భావన కలగకుండా స్వగ్రామంలో బోనాలు జరుపుకున్న అనుభూతి కలిగిందని తెలంగాణ ప్రవాసులు నిర్వాహకులను అభినందించారు. భక్తి, భాష, సంస్కృతి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన ఈ బోనాల మహోత్సవం యూఏఈ తెలంగాణ ప్రవాస సమాజానికి చిరస్మరణీయమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకగా నిలిచింది.

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం..

**చివరి దశలో శాస్త్రీయ పరీక్షలు**





**ముద్ర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనుల దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పరీక్షల నివేదికల ఆధారంగా ఐఐటీ బొంబాయి నిపుణులు పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. నిపుణులు పూర్తి భద్రతా అనుమతులు ఇచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ శాశ్వత పరిష్కారంతో ప్రాజెక్టును పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 21.07.2026
www.mudranews.in
@mudranews
mudratv



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ఫ్యాటీ లివర్‌తో ప్రమాదం..



అలసట, కుడివైపు పొత్తికడుపు పైభాగంలో అసౌకర్యం, బరువు పెరగడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు చాలా మందిలో కనిపిస్తాయి. అయితే వీటిని లైట్ గా తీసుకుంటారు. పెద్ద ఆరోగ్య సమస్య వచ్చే ముందు ఇలాంటి లక్షణాలే ఉంటాయని కొందరు వైద్యులు చెబుతున్నారు. అలాంటి వాటిలో ఫ్యాటీ లివర్ (Fatty Liver Disease) ఒకటి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న ఆరోగ్య సమ స్యల్లో దీని గురించి చెబుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే కా లక్రమేణా లివర్‌లో తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి ఇది రాకుండా ఏం చేయాలి? పై లక్షణాలు ఉన్న వెంటనే ఎలాంటి కేర్ తీసుకోవాలి?

### ఫ్యాటీ లివర్ అంటే ఏమిటి?

మన శరీరంలోని కాలేయం (లివర్)లో కొద్దిపాటి కొవ్వు ఉండటం సహజమే. కానీ లివర్ బరువులో 5 నుంచి 10 శాతానికి మించి కొవ్వు పేరుకుపోతే దానిని ఫ్యాటీ లివర్ అంటారు. ఇది ఎక్కువగా ఊబకాయం, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అనారోగ్యకర ఆహారపు అలవాట్ల వల్ల వస్తుంది. మద్యం సేవించని వారిలో కూడా ఈ సమస్య ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తోంది.

### కృత్రిమ చక్కెరలే ప్రధాన కారణం

ప్రముఖ వైద్య నిపుణుల ప్రకారం.. ఫ్యాటీ లివర్‌కు ప్రధాన కారణాల్లో ఒకటి కృత్రి మ చక్కెరలు అని అంటున్నారు. ముఖ్యంగా సాఫ్ట్ డ్రింక్స్, ప్యాకేజ్డ్ జ్యూసులు, బేకరీ పదార్థాలు, కేకులు, బిస్కెట్లు, స్వీట్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో ఉండే అధిక చక్కెర లివర్‌లో కొవ్వు పేరుకుపోవడానికి దోహదం చేస్తుంది. కాబట్టి వీటిని సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచాలని ఆయన సూచిస్తున్నారు.

### ఎలా రివర్స్ చేయవచ్చు?

ఫ్యాటీ లివర్ ప్రారంభ దశలో ఉంటే జీవనశైలిలో మార్పు లతో నియంత్రించవచ్చు. శరీర బరువును 7–10 శాతం వరకు తగ్గించడం, ప్రతిరోజూ కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయడం, చక్కెరలు, జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండటం, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయి.

### హై ప్రొటీన్ బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరి

ఉదయం తీసుకునే అల్పాహారం ఆరోగ్యానికి ఎంతో కీలకం. అధిక ప్రోటీన్ ఉన్న బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం వల్ల ఆకలి నియంత్రణలో ఉండటమే కాకుండా శరీరంలో కొవ్వు పేరుకుపోవడం కూడా తగ్గుతుంది. గుడ్లు, పెసరపప్పు, శనగలు, పెరుగు, పనీర్, ఓట్స్ వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను ఉదయాన్నే తీసుకోవడం లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### ఆలివ్ ఆయిల్, చేపలు ఆహారంలో ఉండాలి

వంటల్లో ఆలివ్ ఆయిల్‌ను పరిమితంగా ఉపయోగించడం, అలాగే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే చేపలను వారానికి రెండు లేదా మూడు సార్లు తీసుకోవడం వల్ల లివర్‌లోని కొవ్వు తగ్గే అవకాశం ఉంటుంది. ఇవి శరీరంలో వాపును తగ్గించడంతో పాటు లివర్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి.

అయితే ఫ్యాటీ లివర్‌ను చిన్న సమస్యగా భావించకుండా ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, బరువు నియంత్రణ, చక్కెరల వినియోగం తగ్గించడం ద్వారా లివర్‌ను దీర్ఘకాలం ఆరోగ్యంగా కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఆధ్యాత్మిక రహస్యం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావం అన్నీ ఒకే వేదికపై దర్శనమిచ్చే అద్భుతమైన ఆధ్యాత్మిక వేడుక బోనాల జాతర. ఆషాఢ మాసం ప్రారంభం కాగానే రాష్ట్రవ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడుతాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరాల వరకు మహిళలు తలపై బోనం మోసుకుంటూ అమ్మవారికి నైవేద్యం సమర్పించడం, డప్పుల మోతలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ఊరేగింపులు బోనాల ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భక్తి, సంప్రదాయం, జానపద కళలు కలిసిన ఈ మహోత్సవం తెలంగాణ ప్రత్యేకతకు ప్రతీకగా నిలిచింది. 'బోనం' అనే పదం 'భోజనం' నుంచి ఉద్భవించిందని పండితులు చెబుతారు. కొత్త మట్టి లేదా ఇత్తడి పాత్రలో అన్నం, బెల్లం, పాలు లేదా పెరుగు, పసుపు, కుంకుమతో అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడాన్ని బోనం అంటారు. ఈ బోనాన్ని భక్తితో సమర్పిస్తే గ్రామ దేవత సంతోషించి కుటుంబానికి ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులు ప్రసాదిస్తుందనే విశ్వాసం ఉంది.

### ఎక్కడ మొదలై ఎక్కడ ముగుస్తాయి?

సంప్రదాయం ప్రకారం బోనాల ఉత్సవాలు ముందుగా గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక అమ్మవారి ఆలయంలో ప్రారంభమవుతాయి. అనంతరం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, హైదరాబాద్ లాల్ దర్వాజా సింహవాహిని ఆలయం, అలాగే తెలంగాణలోని అనేక గ్రామ దేవతల ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. చివరగా ఘటాల ఊరేగింపుతో బోనాల మహోత్సవం ముగుస్తుంది.



### 2026 బోనాల ముఖ్య తేదీలు

**జూలై 16:** గోల్కొండ జగదాంబిక ఆలయంలో ఉత్సవాలకు శ్రీకారం.

**జూలై 19:** తొలి బోనం, గోల్కొండలో ప్రధాన ఉత్సవాలు, లష్కర్ ఘటోత్సవం.

**ఆగస్టు 2:** సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ప్రధాన బోనాలు.

**ఆగస్టు 3:** రంగం కార్యక్రమం, అంబారీపై అమ్మవారి ఊరేగింపు.

**ఆగస్టు 9:** లాల్ దర్వాజా, పాతబస్తీ ప్రాంతాల్లో బోనాల వేడుకలు.

**ఆగస్టు 10:** ఘటాల ఊరేగింపుతో మహోత్సవాల ముగింపు.

### బోనాల వెనుక ఉన్న పురాణ విశ్వాసం

తెలంగాణ ప్రాంతంలో ఒకప్పుడు వ్యాపించిన అంటువ్యాధుల నుంచి ప్రజలను గ్రామ దేవత రక్షించిందని స్థానిక విశ్వాసం. ఆ తల్లికి కృతజ్ఞతగా ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి బోనాల ఉత్సవాన్ని నిర్వహించే ఆచారం ఏర్పడింది. అప్పటి నుంచి ఇది కేవలం పండుగగా కాకుండా ప్రజల విశ్వాసానికి ప్రతీకగా కొనసాగుతోంది.

### ఆషాఢంలోనే బోనాలు ఎందుకు?

తెలుగు సంప్రదాయం ప్రకారం కొత్తగా పెళ్లైన కుమార్తె ఆషాఢ మాసంలో పుట్టింటికి రావడం ఆనవాయితీ. అదే విధంగా జగన్మాత కూడా ఈ నెలలో తన భక్తుల వద్దకు వస్తుందని నమ్మకం. అందుకే అమ్మవారిని ఇంటికి వచ్చిన కుమార్తెలా భావించి బోనం, చీర, సారె, పండ్లు, పూలతో ఘనంగా సత్కరిస్తారు. ఈ పూజలతో అమ్మవారి అనుగ్రహం లభించి కుటుంబంలో శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు.

### బోనాల జాతరలో కనిపించే విశేషాలు

బోనాల సమయంలో ప్రతి ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతుంది. తలపై బోనం మోసుకుంటూ మహిళలు భక్తిగీతాలు పాడుతూ ఊరేగింపులో పాల్గొంటారు. పోతురాజు విన్యాసాలు, డప్పుల మోతలు, శివసత్తుల నృత్యాలు, ఘటాల ఊరేగింపులు, రంగం కార్యక్రమం ఈ ఉత్సవాల ప్రత్యేక ఆకర్షణలు. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివస్తారు.

### తెలంగాణ బోనాల చరిత్ర

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన అత్యంత ప్రాచీన జానపద ఉత్సవాల్లో బోనాల పండుగ ఒకటి. దాదాపు 600 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పండుగకు పల్లవుల పాలనా కాలంలోనే మూలాలు ఉన్నాయని చరిత్రకారులు పేర్కొంటారు. అనంతరం కాకతీయులు, విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలు, కుతుబ్ షాహీ పాలకులు కూడా ఈ ఉత్సవాలను విశేష వైభవంతో నిర్వహించినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా కుతుబ్ షాహీల కాలంలో బోనాల వేడుకలు నెల రోజుల పాటు ఘనంగా జరిగేవని చెబుతారు.

అయితే, ప్రస్తుతం మనం చూస్తున్న రూపంలో హైదరాబాద్‌లో బోనాల పండుగకు విశేష ప్రాధాన్యం 1869 తర్వాత లభించింది. ఆ సమయంలో హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలను ప్లేగు మహమ్మారి తీవ్రంగా వణికించింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఉజ్జయినిలో ఉన్న మహంకాళి అమ్మవారిని ప్రార్థించిన మిలిటరీ బెటాలియన్ జవాన్లు.. మహమ్మారి నుంచి నగరం విముక్తి పొందితే హైదరాబాద్‌లో అమ్మవారికి ఆలయం నిర్మించి, బోనాలు సమర్పిస్తామని మొక్కుకున్నారు. వారి మొక్కు నెరవేరిన తర్వాత సికింద్రాబాద్‌లో శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ప్రతిష్ఠించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. అప్పటి నుంచి బోనాల ఉత్సవాలు ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సంప్రదాయంగా మారాయి.

1908లో సంభవించిన మూసి నది మహా వరద కూడా బోనాల పండుగ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. ఆ వరదలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, నగరం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. ఈ విపత్తు నుంచి ప్రజలను కాపాడాలని అప్పటి నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్.. లాల్ దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా మూసి నదిలో పసుపు, కుంకుమ, గాజులు, పట్టు వస్త్రాలను సమర్పించి అమ్మవారి అనుగ్రహాన్ని కోరారు. అప్పటి నుంచి లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో ఆషాఢ మాసం చివరి ఆదివారం బోనాల మహోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

- నరేష్, ముద్ర

### ఆధ్యాత్మిక సందేశం

బోనాలు కేవలం ఒక జాతర మాత్రమే కాదు. భక్తి, కృతజ్ఞత, సమాజ ఐక్యత, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. అమ్మవారిని ఆరాధించడం ద్వారా కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, దుష్టశక్తుల నుంచి రక్షణ లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు ఈ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందుతుంటారు. ఈ ఆషాఢ మాసంలో మీరు కూడా అమ్మవారికి భక్తితో బోనం సమర్పించి, బోనాల జాతరలో పాల్గొని తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ఆస్వాదించండి. జగదాంబిక కటాక్షంతో మీ కుటుంబానికి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు చేకూరాలని మనసా రా ప్రార్థిద్దాం.

# గానుగ నూనే శ్రేయస్కరం



ఇటీవలి కాలంలో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో కోల్డ్ ప్రెస్డ్ (గానుగ) నూనెల వినియోగం మళ్లీ పెరుగుతోంది. ఒకప్పుడు ప్రతి ఇంట్లో సాధారణంగా ఉపయోగించిన ఈ సంప్రదాయ నూనెలు ఇప్పుడు సహజమైన ఆహార పదార్థాలుగా మళ్లీ ప్రాచుర్యం పొందుతున్నాయి. అయితే కోల్డ్ ప్రెస్డ్ నూనెలు నిజంగా ఆరోగ్యానికి ఎంతవరకు మంచివి? వీటిని రోజువారీ వంటల్లో ఉపయోగించవచ్చా? అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. ఆహార నిపుణుల ప్రకారం, సరైన పరిమాణంలో ఉపయోగిస్తే కోల్డ్ ప్రెస్డ్ నూనెలు ఆరోగ్యకరమైన ఎంపికగా ఉంటాయి.

### కోల్డ్ ప్రెస్డ్ నూనెల ప్రత్యేకత ఏమిటి?

కోల్డ్ ప్రెస్డ్ నూనెలను తక్కువ ఉష్ణోగ్రతల వద్ద చెక్క ప్రెస్ లేదా సంప్రదాయ పద్ధతుల ద్వారా తయారు చేస్తారు. ఈ విధానంలో నూనెలోని సహజ యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-ఈ, ఆరోగ్యకరమైన కొవ్వులు కొంతవరకు నిల్వ ఉండే అవకాశం ఉంటుంది. అలాగే ఈ నూనెలు విత్తనాలు, గింజల సహజమైన సువాసన, అసలైన రుచిని కూడా కాపాడుతాయి. అందుకే సంప్రదాయ వంటకాలలో వీటికి ప్రత్యేక స్థానం ఉంది.

### శుద్ధి చేసిన నూనెలతో పోలిస్తే తేడా?

రిఫైన్డ్ నూనెలను సాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు,వివిధ రసాయన ప్రక్రియల ద్వారా తయారు చేస్తారు. దీని వల్ల నూనె ఎక్కువ కాలం నిల్వ ఉండేలా ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో కొన్ని సహజ పోషకాలు తగ్గే అవకాశం ఉంటుంది. కోల్డ్ ప్రెస్డ్ నూనెలలో సహజ లక్షణాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఇవి సరిగ్గా నిల్వ చేయకపోతే త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది.

### ఆరోగ్య ప్రయోజనాలు

వేరుశెనగ, నువ్వులు, కొబ్బరి, పొద్దుతిరుగుడు వంటి గింజల నుంచి తయారు చేసే కోల్డ్ ప్రెస్డ్ నూనెలలో శరీరానికి అవసరమైన మంచి కొవ్వులు ఉంటాయి.

**నువ్వుల నూనె**

కాల్షియం, సెసమోల్ వంటి యాంటీఆక్సిడెంట్లు కలిగి ఉంటుంది. చర్మ ఆరోగ్యానికి, శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడం లో సహాయపడుతుంది.

**వేరుశెనగ నూనె**

ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తుంది. శక్తికి ఉపయోగపడే మంచి కొవ్వుల మూలంగా ఉంటుంది.

**కొబ్బరి నూనె**

మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్, MCTs వంటి కొవ్వులను కలిగి ఉంటుంది. అయితే ఏ నూనె అయినా అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. పరిమితంగా ఉపయోగించడం ముఖ్యం.

### ఆరోగ్యానికి అసలైన రహస్యం ఏమంటే?

కేవలం మంచి నూనె వాడటం వల్లే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదు. సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, సరైన జీవనశైలి మరియు నూనెలను మితంగా ఉపయోగించడం ద్వారా మాత్రమే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కాబట్టి కోల్డ్ ప్రెస్డ్ నూనెలు మంచి ఎంపిక అయినప్పటికీ, వాటిని సరైన మోతాదులో, సరైన పద్ధతిలో ఉపయోగించడం చాలా ముఖ్యం.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ★ఒకే రకమైన నూనెను ఎప్పుడూ ఉపయోగించకుండా వేరుశెనగ, నువ్వులు, ఆవాలు, పొద్దుతిరుగుడు నూనెలను మార్చి మార్చి ఉపయోగించడం మంచిది.
- ★నూనెను పదేపదే వేడి చేయకూడదు. ఇలా చేయడం వల్ల హానికరమైన సమ్మేళనాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.
- ★నూనెను ఎప్పుడూ చల్లని ప్రదేశంలో, సరిగ్గా మూసివేసిన సీసాలో నిల్వ చేయాలి.
- ★నూనె కొనుగోలు చేసేటప్పుడు స్వచ్ఛమైన, నమ్మకమైన బ్రాండ్ లేదా నేరుగా నూనె తయారీ కేంద్రాల నుంచి కొనడం ఉత్తమం.
- ★కృత్రిమ రంగులు, సువాసనలు లేదా కల్తీ లేని నూనెను ఎంచుకోవాలి.
- ★ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి
- ★గుండె సంబంధిత సమస్యలు, అధిక కొలెస్ట్రాల్ లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తమ ఆహారంలో ఏ రకమైన నూనెను ఉపయోగించాలో వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

### రోజు 24 నిమిషాలు ఇలా చేయండి

# ఒత్తిడి మాయం..

ప్రస్తుత కాలంలో ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, పిల్లల సంరక్షణ, సామాజిక ఒత్తిళ్లు వంటి అనేక కారణాలతో మహిళలు తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. చాలామంది తమ ఆరోగ్యాన్ని కంటే కుటుంబ సభ్యుల అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు జాతీయ మహిళా కమిషన్ 'మానసిక శక్తి' పేరుతో ఒక ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేసింది. ఇందులో మహిళలు మానసిక ప్రశాంతతను ఎలా పొందాలి? ఒత్తిడిని ఎలా అధిగమించాలి? అనే అంశాలపై పలు సూచనలు చేసింది. అవేంటంటే?

జాతీయ మహిళా కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశంలో సుమారు 10.5 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో అత్యధికులు మహిళలే. వ్యక్తిగతంగా తమ కోసం సమయం కేటాయించుకోలేకపోవడం, కుటుంబ సభ్యుల సహకారం లేకపోవడం, మానసిక ఆరోగ్యంపై అవగాహన తక్కువగా ఉండటం వల్ల చాలా మంది మహిళలు చికిత్స తీసుకోవడానికి కూడా ముందుకు రావడం లేదని పేర్కొంది.

పిల్లలు పుట్టిన తర్వాత సుమారు 19 శాతం మంది మహిళలు మానసిక క్షోభ సమస్యను ఎదుర్కొంటున్నట్లు నివేదిక వెల్లడించింది. ఈ సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు భావోద్వేగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఉదయం లేవగానే ఆందోళన, అతిగా ఆలోచించడం, అలసట, నిరుత్సాహం వంటి లక్షణాలు కనిపించినా వాటిని చాలామంది సాధారణ సమస్యలుగానే భావించి నిర్లక్ష్యం చేస్తున్నారని కమిషన్ తెలిపింది.

అయితే ఈ పరిస్థితుల నుంచి బయటపడడానికి కొన్ని టిప్స్ ను సూచించారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజులోని 24 గంటల్లో కనీసం ఒక శాతం సమయం అంటే 24 నిమిషాలు పూర్తిగా తమ కోసం కేటాయించాలని కమిషన్ సూచించింది. ఇందులో ఉదయం 10 నిమిషాలు రోజును ప్రశాంతంగా ప్రారంభించేందుకు, మధ్యాహ్నం 4 నిమిషాలు శక్తిని తిరిగి పొందేందుకు, సాయంత్రం 10 నిమిషాలు మరుసటి రోజుకు మానసికంగా సిద్ధం కావడానికి ఉపయోగించుకోవాలని పేర్కొంది.

ఈ 24 నిమిషాల్లో మొబైల్ ఫోన్‌ను పూర్తిగా పక్కన పెట్టి ప్రశాంతమైన ప్రదేశంలో కూర్చోవాలి. మొదట రెండు నిమిషాల పాటు లోతుగా శ్వాస తీసుకుని నెమ్మదిగా వదలాలి. అనంతరం మనసుకు నచ్చిన ఒక మంచి ఆలోచన లేదా సానుకూలమైన వాక్యాన్ని ఒక నిమిషం పాటు పునరావృతం చేయాలి. ఆ తర్వాత వెంటనే స్పందించకుండా మనసులో వచ్చే ఆలోచనలను నిశితంగా గమనించాలి. ఇలా చేయడం వల్ల మనసు ప్రశాంతంగా మారి సానుకూలంగా ఉండేందుకు సహాయపడుతుంది.

రోజులో ఏదో ఒక సమయంలో కోపం, ఆందోళన లేదా ఒత్తిడి తీవ్రంగా పెరిగినప్పుడు శ్వాస వేగంగా మారుతుంది. ఈ సమయంలో శరీరంలో ఒత్తిడిని పెంచే హార్మోన్లు విడుదలై మెదడుపై ప్రభావం చూపుతాయి. అలాంటి సమయంలో నెమ్మదిగా శ్వాస తీసుకోవడం ద్వారా నాడీ వ్యవస్థ ప్రశాంతమవడంతో పాటు గుండె స్పందన రేటు తగ్గుతుందని కమిషన్ తెలిపింది.

రుతుక్రమం సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా ఆందోళన, చికాకు, బాధ, కోపం, అతిగా ఆలోచించడం, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు రావడం సహజమే. వీటితో పాటు తలనొప్పి, కడుపునొప్పి, నిద్రలేమి, నీరసం వంటి శారీరక ఇబ్బందులు కూడా ఎదురవుతాయి.తుక్రమం సమయంలో ప్రశాంతంగా కూర్చుని రెండు నిమిషాల పాటు లోతుగా శ్వాస తీసుకుని నెమ్మదిగా వదలాలి. భుజాలు, కడుపు కండరాలను రిలాక్స్‌గా ఉంచాలి. రోజుకు రెండు నుంచి మూడు సార్లు ఈ విధానం పాటించడం మంచిదని కమిషన్ సూచించింది. అలాగే అధిక శ్రమ అవసరమయ్యే పనులను తగ్గించి, ప్రశాంతమైన సంగీతాన్ని వినడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని తెలిపింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 21.07.2026
www.mudranews.in | @mudranews



వానాకాలం చిట్కాలు



తడిసిన బట్టలు వెంటనే మార్చండి – తడి బట్టలు ఎక్కువసేపు ధరించడం వల్ల చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

# జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం





- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి
- ఘనంగా మంచాల, యాచారం మండలాల సంయుక్త సమావేశం
- జర్నలిస్టులు అందరికీ అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డుల మంజూరుకై ప్రభుత్వంతో చర్చలు
- సమావేశంలో పాల్గొన్న రంగా రెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలీమ్ పాషా, మేకల సత్యనారాయణ

(ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా )

జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(TUWJ) నిరంతరం అండగా ఉంటుందని, సమస్యల సాధనలో రాజీలేని పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నాడు మంచాల, యాచారం మండలాల టీయూడబ్ల్యూజే సంయుక్త విస్తృత స్థాయి సమావేశం రంగా రెడ్డి జిల్లా మంచాల మండలం కాగజ్ ఘాట్ లోని సిరి నేచర్ వ్యాలీ రిసార్ట్ లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ, సమాజ శ్రేయస్సుకై పాటుపడుతున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లయిన అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ కార్డుల మంజూరు, కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ, అలాగే కుటుంబాలకు ధీమానిచ్చేలా గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) సౌకర్యం కల్పించే విషయాలపై ఇప్పటికే యూనియన్ తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వీటి సాధన వరకు ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులంతా విభేదాలు వీడి, ఒకే తాటిపైకి వచ్చి యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణలు మాట్లాడుతూ.. మండల స్థాయిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థానిక సమస్యలపై త్వరలోనే జిల్లా కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు లేదా అక్రమ కేసులు జరిగితే యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని, లీగల్ సెల్ ద్వారా వారికి పూర్తి న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.ప్రతి నియోజకవర్గం లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు పాండు యాదవ్, పాండురంగారెడ్డి, సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, ఆంజనేయులు, సూర్యనారాయణ, రమేష్,మాజీ జిల్లా అధ్యక్షులు ఆనంతుల శ్రీనివాస్, ఈ సీ సభ్యులు ఇలియాజ్ షరీఫ్, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనివాస్, పాండు, సీనియర్ జర్నలిస్టులు బియ్యాని సురేష్, మొకిళ్ళ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొని జర్నలిస్టుల హక్కుల రక్షణకు స్థానిక కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంచాల, యాచారం మండలాల పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులు, వివిధ పత్రికల విలేఖరులు, యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**టీయూడబ్ల్యూజే మంచాల మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు కోటప్ప, ప్రధాన కార్యదర్శి రంజిత్, కోశాధికారిగా శాస్త్రి, వైస్ ప్రెసిడెంట్ మహేష్, మధుసూదన్ రెడ్డి .

**టీయూడబ్ల్యూజే యాచారం మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు పెంటయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ గా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని టీయూడబ్ల్యూజే జిల్లానాయకులు సన్మానించారు. అనంతరం జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## పనిచేసేవారికే గుర్తింపు.. జీహెచ్ఎంసీ ఎన్నికలే లక్ష్యం




**కూకట్ పల్లి ముద్ర :** పార్టీలో పదవులు కేవలం హోదా కోసం కాదని, పనిచేయడానికి మాత్రమేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి పార్టీ ఇంచార్జి బండి రమేష్ స్పష్టం చేశారు. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ గడువు ఆగస్టు 3తో ముగియనున్న నేపథ్యంలో, ఇంటింటికి ఓటర్ ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీపై బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ పత్రాలు సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోతారనే విషయాన్ని ప్రతి ఒక్క ఓటరుకు వివరించాల్సిన బాధ్యత బి ఎల్ ఎ లపై ఉందన్నారు. దొంగ ఓట్ల నమోదుపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద ప్రతి ఒక్కరి ప్రోగ్రెస్ రిపోర్ట్ ఉంటుందని, సీనియర్లను కలుపుకుపోతూ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు మనకు సెమీఫైనల్స్ లాంటివని, ప్రతి డివిజన్ లో త్రిముఖ పోరు ఉండే అవకాశం ఉన్నందున శ్రేణులు సమాయత్తం కావాలని కోరారు. పార్టీలో పదవులు ఎవరి వ్యక్తిగత ఇష్టాల బట్టి కాకుండా, గాంధీభవన్ ఆదేశాల మేరకు పనిచేసేవారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ జిల్లా ఇంచార్జి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బి ఎల్ ఎ ఫామ్స్ సమర్పణతో పాటు భవిష్యత్తు ఎన్నికలకు ఉపయోగపడేలా ఓటర్ల డేటాను కూడా పక్కాగా సేకరించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ఐఆర్ జిల్లా ఇంచార్జి సుబ్రహ్మణ్యం, కూకట్పల్లి నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా, మైనారిటీ అధ్యక్షులు, నియోజకవర్గ యువజన నేతలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## బాలనగర్ డివిజన్‌లో ఘనంగా ఎస్ఐఆర్ : బండి రమేష్

**కూకట్పల్లి ముద్ర :** కూకట్పల్లి నియోజకవర్గంలోని బాలనగర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిత్యం అనుసంధానమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయాలని సూచించారు. బాలనగర్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పులి శివా గౌడ్‌తో పాటు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, శ్రీకాంత్ పటేల్, తూము వేణు, రామ్మోహన్, మదన్మోహన్, శ్రీకాంత్ గౌడ్, ఇతర నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## గిన్నిస్ విజేతలను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..

**ముద్ర, కాప్రా :** ప్రపంచ స్థాయిలో తెలంగాణ ప్రతిష్ఠను చాటిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ విజేతలను ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకాలు అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు.ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో నాచారం టీం మాస్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బి.మోహన్ కుమారుడు బి.రాము బి.గట్టు, బి.భరత్, బి.చెన్నమ్మ, జే.కృత్విక్, బి.యక్షిత్ వర్ధన్, శివచరణ్, శివకుమార్, మాణితేజ ఈ పోటీల్లో పాల్గొని విజయాన్ని నమోదు చేశారు. కార్యక్రమం అనంతరం 45 రోజుల తర్వాత వారికి గిన్నిస్ రికార్డ్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందాయి. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొస్తున్న యువతను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి నగదు ప్రోత్సాహకాలు, అవార్డులు, శిక్షణ అవకాశాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువతలో స్ఫూర్తి నింపవచ్చని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.



## విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన ఏఐవైఎఫ్

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద "చలో పార్లమెంట్" కార్యక్రమంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, నిర్బంధాలకు పాల్పడడాన్ని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రి, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలకు సమాధానాలు చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం దమనకాండకు పాల్పడటం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ఎన్టీఏలో పారదర్శకత కల్పించి సంస్కరణలు చేపట్టాలని, విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేసి నిర్బంధితులను వెంటనే విడుదల చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

## మహంకాళి నగర్‌లో రూ.48.65 లక్షలతో యూజీడీ పనులకు శంకుస్థాపన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో మహంకాళి నగర్ చౌరస్తా నుంచి తులసి వనం ఔట్‌లెట్ వరకు రూ.48 లక్షల 65 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పైప్‌లైన్ నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, జలమండలి అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, కాలనీల్లో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని అత్యవసరంగా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక చొరవతో యూజీడీ పనులు చేపడుతున్నామని చెప్పారు. మహంకాళి నగర్‌లో తరచూ డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రూ.48.65 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణాన్ని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు.నాణ్యత ప్రమాణాలతో పనులు నిర్వహించాలని అధికారులకు సూచించిన ఆయన, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తామని ఆరెకపూడి గాంధీ తెలిపారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని స్పష్టం చేశారు.

## ఉప్పల్ అభివృద్ధి కి ప్రత్యేక చొరవ



**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ముద్ర,ఉప్పల్ ప్రతినిధి :** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థల దుస్థితిపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఈ డి పంకజ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే ఆమోదించి, ప్రాధాన్యత ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని కోరారు.ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, సక్రమమైన మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## యువత గొంతుకకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటుంది

**కూకట్‌పల్లి ముద్ర :** కాంగ్రెస్ జాతీయ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం అత్యంత విజయవంతమైందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ మరియు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హోరెత్తించారు.ఈ సందర్భంగా బండి రమేష్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడిందని విమర్శించారు. నిరుద్యోగం, ప్రశ్నాపత్రాల లీకులు, ఉన్నత విద్యలో అవకాశాల కొరత వంటి సమస్యలతో యువత భవిష్యత్తు అంధకారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, బల్మూర్ వెంకట్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో.. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఉద్యమిస్తుందని నాయకులు పునరుద్ఘాటించారు . ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు




వినోద్ జాకీర్, రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, బల్మూర్ వెంకట్, తూము వేణు, నాగిరెడ్డి, పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, శ్రీనివాస్ బాబు, సాయిబాబా చౌదరి, రంగమోహన్, రాజేష్, శంకర్, పులి శివ గౌడ్, రామారావు, సునీల్, శ్రీకాంత్ పటేల్, మైఖేల్, బాలరాజు, సంధ్య రాణి, జ్యోతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**ముద్ర, హైదరాబాద్:** నగరంలోని బండ్లగూడ జాగీర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని సుధాకర్‌గా గుర్తించారు. ఇంటి బెడ్‌రూమ్‌లో విగతజీవిగా కనిపించడంతో కుటుంబసభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మద్యం బాటిల్‌లో విషం కలిపి తాగినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 21.07.2026
www.mudranews.in | @mudranews



**వర్షాకాలంలో పాటించాల్సిన చిట్కాలు**



గొడుగు లేదా రెయిన్‌కోట్ వెంట ఉంచుకోండి – ఆకస్మిక వర్షాల నుంచి రక్షణతో పాటు జలుబు ప్రమాదం తగ్గుతుంది.

## ఢిల్లీ జంతర్ మంతర్ విద్యార్థి ఉద్యమానికి మద్దతు

**ప్రజా మిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్**



**ముద్ర, కరీంనగర్:** నీట్ పేపర్ లీకేజ్ కు నిరసనంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా నిరసన చేస్తున్న విద్యార్థులకు ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ మద్దతు తెలియజేశారు. సోమవారం కరీంనగర్ పట్టణంలో ని గాంధీ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ఒక మహా ఉద్యమంగా మారుతుందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ బిడ్డలు నీట్, వివిధ పరీక్షలు రాసి నష్టపోయి ఉన్నారు గనుక కరీంనగర్ వాసి మంత్రి పొన్నం ప్రభాకర్ , కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లు విద్యార్థులకు మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో చిగిరి శ్రీధర్,కొంపల్లి రవీందర్, శ్రీరాముల కిషన్ బాబు చిలువేరి రవీందర్ లు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై కేంద్రంపై సీపీఐ విమర్శలు



**ముద్ర, కరీంనగర్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తోందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. కరీంనగర్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని ఆయన డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి, బాష్ప వాయువు ప్రయోగించడం ఖండనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు, సెప్టెంబరులో "ఛలో ఢిల్లీ" కార్య క్రమం నిర్వహిస్తామని చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి , బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు పొన్నం శిరీష, రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేనను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని, ప్రజలకు పార్టీ రక్షణ కవచంగా పనిచేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో కవితమ్మ తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారని, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తెలంగాణ రక్షణ సేనే నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అంతర్గతంగా కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు, నిరుద్యోగుల సంక్షేమమే పార్టీ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, మనకొండూర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు బుడిగె పరుశురాం గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు, రంగరవేణి లక్ష్మణ్, ఏనుగు మల్లారెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గం నాయకులు సురేష్, రాజ్ కుమార్, బండ అశోక్, జంపాల రితేష్, అంబాల హరీష్, కొతురి నరేష్ , గుండారపు కిరణ్, యువ నాయకులు నూతి సాయి చరణ్, మహిళ విభాగం సీనియర్ నాయకురాలు ఎండి సల్మా, అతాహర్, కొలిపాక గౌతమి, కుతాడి రజిత, జంగా అపర్ణ, దాసరి అంజలి లతోపాటు వంద మంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయాలకు తావుండొద్దు

**- జిల్లా కలెక్టర్ చిత్తమిశ్రాకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వినతి**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో పారదర్శకత పాటించాలని, అర్హులైన పేదలకు మాత్రమే ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చిత్తమిశ్రాను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గృహ నిర్మాణ పథకం అనేది నిరుపేదల సొంతింటి కలను నిజం చేసే కీలకమైన కార్యక్రమమని, దీనిని ఎంతో బాధ్యతాయుతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేటాయింపు ప్రక్రియలో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా, పూర్తిగా నిబంధనల ప్రకారం అర్హులైన వారికే ఇండ్లు దక్కేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. దాంతోపాటు గతంలో ఆరెపల్లి గ్రామంలో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో అప్పుడు ఇండ్లు కోల్పోయినవారికి అప్పటి కలెక్టర్ వారికీ డబుల్ బెడ్ రూమ్ లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని... ఇచ్చిన హామీ మేరకు వారికీ తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి వారికీ తగిన న్యాయం చేయాలన్నారు.

ముఖ్యంగా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన జరిపి, నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. ఇండ్ల కేటాయింపులో ఎలాంటి వివక్ష ఉండకూడదని, రాజకీయ పార్టీలకు అతీతంగా పేదరికాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని జాబితాను రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యమంలా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమం

**- ఊరూరా ఇంకుడుగుంతలు, ఊట కుంటలు నిర్మించాలి**
**– కలెక్టర్ చిత్రా మిశ్రా**



**ముద్ర, కరీంనగర్, :** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు పిలుపునిచ్చారు. వీబీజీ రామ్–జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు. వీబీజీ రామ్–జీ పథకం కింద ప్రభుత్వం ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులు చేపడుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్–జీ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, గనులు–భూగర్భ శాస్త్రం, మత్స్య, ప్రణాళిక, విద్యుత్ శాఖలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) అధికారులు పరస్పర సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## SIR ప్రక్రియను 100% పూర్తి చేయాలి: చంద్రశేఖర్ రెడ్డి

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సమగ్ర ఓటర్ సవరణ (SIR) ప్రక్రియను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇంచార్జ్ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూలై 31 నాటికి 90 శాతం, ఆగస్టు 3లోపు 100 శాతం SIR పూర్తి చేసిన కార్యకర్తలకు రాహుల్ గాంధీతో ఫోటో దిగే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాలని, BLOలతో సమన్వయం చేసుకుని BLA–2లు ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్ ఐ ఆర్ రిటర్నింగ్ ఆఫీసర్ మడుపు మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గంట కళ్యాణి శ్రీనివాస్, మల్లికార్జున రాజేందర్, ఆకుల నందిని ఉదయ్, కళ్ళపల్లి బాలరాజు, గుమ్మడి రాజకుమార్, ఇక్రమ్ సికిందర్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్ తో పాటు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిధి లోని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కే. రామ్ రెడ్డి, పంజాల స్వామి గౌడ్, ఎస్ ఐ ఆర్ సూపర్వైజర్లు, కార్పొరేషన్, మండల స్థాయి నాయకులు, పాల్గొన్నారు.




## ఉచిత కంటి పరీక్షలు వినియోగించుకోండి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఉచిత కంటి పరీక్షల సౌకర్యాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కె శ్రీహరి రావు కోరారు. కూచాడి సత్యమ్మ, ప్రకాష్ రావు స్మారకార్థం ఏర్పాటు చేసిన ఎల్ వి ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందుతున్న సేవలు, ఈ నెలలో సేవలు పొందిన లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. మండల నాయకులు రఫీ మహమ్మద్, పూదరి అరవింద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రవికుమార్, బాపయ్య, పాల్గొన్నారు.



# తక్కువ నీటితో పండే పంటలపై అవగాహన కల్పించాలి

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి .**
**ఎల్‌నినో ప్రభావంపై నల్గొండ జిల్లా ఉన్నతస్థాయి సమీక్ష**
**నిర్వహించిన ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**




**ముద్ర, నల్గొండ:** తక్కువ నీటితో సాగు అయ్యే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని నల్గొండ జిల్లా ఇన్ చార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎల్ నియో ప్రభావంపై ఉమ్మడి నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తాగునీరు, సాగునీటి నిర్వహణతో పాటు ఇతర సంబంధిత అంశాలపై నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇంచార్జ్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మూడు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, పశుసంవర్ధక తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..ఎల్‌నియో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, సాగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని, మూడు జిల్లాల అధికారులు పరస్పర సమన్వయంతో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

# వరుస దొంగతనాలతో పోలీసులకు సవాల్

**వారంలో మూడు దొంగతనాలు**
**అపార్ట్మెంట్లనూ వదలని దొంగలు**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలో ఇటీవలి కొద్ది రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలు పోలీసు శాఖకు సవాలుగా మారాయి. పది రోజుల క్రితం శనివారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో దివ్యనగర్ లోని ఒక అపార్ట్మెంట్ లో రెండు ఫ్లాట్ ల్లో దోపిడికి పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు. ఈ ఉదంతం పై పోలీసు విచారణ జరుగుతున్న సమయంలోనే మరో మూడు రోజుల తర్వాత నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండల కేంద్రంలోని రెండిళ్లలో దొంగలు తెగబడ్డారు. ఘటనలో రూ.80 వేల నగదు, తులం బంగారాన్ని దొంగిలించారు. గత బుధవారం మధ్యాహ్నం దాదాపు 1.30 గంటల ప్రాంతంలో ఎస్ వి టవర్స్, ఈద్గాం ప్రాంతంలో శ్రవణ్ కుమార్ ఇంట్లో దొంగతనానికి పాల్పడి పెద్ద మొత్తంలో వెండి, కొంత బంగారం దొంగిలించారు. ఒక పక్క పోలీసులు ప్రతి రోజు పెట్రోలింగ్ చేస్తున్నా, అపార్ట్మెంట్ లలో సీసీ కెమెరాలు, భారీ ఎత్తున భద్రత ఉన్నా దొంగతనాలు ఆగటం లేదు. పోలీసు శాఖకు సి సి కెమెరాలున్నా దొంగలు చిక్కడం లేదు. ఇదిలా ఉంటే నిర్మల్ దివ్యనగర్ లో దోపిడికి పాల్పడిన ముఠా మహారాష్ట్రకు చెందిన వారని పోలీసులు భావిస్తున్నారు. వీరు వాహనాలను దొంగిలించి అవే వాహనాల్లో దొంగతనాలకు వెళ్లి వాహనాలను ఎక్కడో ఒక చోట వదిలి వెళ్ళిపోతున్నారు. కాగా దివ్యనగర్, ఈద్గాం రెండూ కూడా జనసమ్మర్ధం ఉన్న ప్రాంతాలే కావటం గమనార్హం. ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న అపార్ట్మెంట్ లలో దొంగతనం జరగటం పోలీసులకు ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి రోజూ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ప్రధాన రహదారి పై జరిగిన రెండు దొంగతనాలు ఉలిక్కి పడేలా చేశాయి. ఇదిలా ఉంటే మూడు ఘటనలు జాతీయ రహదారి 62 పైనే జరగటం గమనార్హం. కాగా దివ్యనగర్ అపార్ట్మెంట్ లో దొంగల చేతుల్లో పొడవైన కత్తులతో పాటు పలు మారణాయుధాలున్నట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. ఈ ఘటన అనంతరం జిల్లా సబ్ జడ్జి రాధిక ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐతే అపార్ట్ మెంట్ ల్లో ఇంత పకడ్బందీగా ఉన్నా దొంగతనాలు జరగటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

## స్వర్ణావధానంలో వెంకట్ కు పృచ్ఛక సన్మానం




ముద్ర ప్రతినిధి, నిర్మల్: నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, సంస్కృత భాషా ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బి. వెంకట్‌కు హైదరాబాద్‌లో నిర్వహించిన స్వర్ణావధాన కార్యక్రమంలో స్వర్ణావధాన పృచ్ఛక సన్మానం అందించారు. అక్షరకౌముది సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, తెలంగాణ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తల చేతుల మీదుగా ఆయన ఈ సన్మానాన్ని స్వీకరించారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిపిఎం డిమాండ్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఇటీవల నీట్ ప్రశ్న పత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగుల నర్సాగౌడ్ ,ఎండి రియాసత్, బిల్డింగ్ వర్కర్స్ రాకేష్, శంకర్ లింగం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 21.07.2026
www.mudranews.in | @mudranews



## వానాకాలంలో చిట్కాలు



చేతులను తరచూ కడుక్కోండి – భోజనం ముందు, బయట నుంచి వచ్చిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోండి.

# వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే రైతులకు ఆదాయం

### డిప్యూటీ సీఎం భట్టి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తేనే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో గోద్రెజ్ సమీకృత ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రస్తుతం ఉన్న 3 లక్షల ఎకరాల నుంచి 10 లక్షల ఎకరాలకు విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు నాలుగేళ్లలో ఎకరాకు సుమారు రూ.52 వేల ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు. ఖమ్మంలో మరిన్ని అగ్రో ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, దీంతో రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనే తొలి సమీకృత ఆయిల్ పామ్ సీడ్ గార్డెన్‌ను ఖమ్మంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి 10 వేల ఎకరాలకు ఒక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడమే లక్ష్యమని, త్వరలో రాష్ట్రంలో మరో ఆరు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు ప్రారంభిస్తామని వెల్లడించారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, శిక్షణ, సాంకేతిక సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సభలోవ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేందర్ మోహన్, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ , పోలీస్ కమీషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి



**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , డిఆర్వో జయమ్మ తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 92 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవిన్యూ శాఖ 56 ,సర్వే ల్యాండ్స్ 9, గ్రామీణ అభివృద్ధి 6, మున్సిపాలిటీ 4,సంక్షేమ శాఖ 3, పంచాయతీ 3, డిసి ఓ 2, ఇరిగేషన్ 2, వైద్య ఆరోగ్య 2,ఎస్సీ కార్పొరేషన్ , ఎస్సీ డెవలప్మెంట్, ఆర్ అండ్ బి, ఉపాధి కల్పన, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, హౌసింగ్ పీడీ అలివేలు , ఆర్డీవో కృష్ణారెడ్డి , అధికారులు పాల్గొన్నారు.

## భువనగిరి ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

### సీపీఎం భువనగిరి పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ



**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని లోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు మాయ కృష్ణ అన్నారు. సోమవారం సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖ అధికారి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల మరమ్మతులు, విద్యుత్, ఫ్యాన్లు, బెంచీలు, పరిశుభ్రత వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం వెంటనే అందించాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ సెక్రటేరియట్ సభ్యులు గంధమల్ల మాతయ్య, సిపిఎం పట్టణనాయకులు బర్ల వెంకటేష్ ఈర్ల రాహుల్, మన్నె రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22న దివ్యాంగులు, నిరుద్యోగ యువతకు ప్రత్యేక జాబ్ మేళా

**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** ఈ నెల 22న జిల్లా కలెక్టరెట్ లోని ఉపాధి కార్యాలయంలో సమర్థనం ట్రస్ట్ ఫర్ ది డిస్సబైడ్ సహకారంతో దివ్యాంగులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి యన్. పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా 3 నెలల రెసిడెన్షియల్ స్కిల్ ట్రైనింగ్ అందించబడుతుందన్నారు.శిక్షణలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్, బేసిక్ కంప్యూటర్స్, బీపీవో/రిటైల్ ట్రేడ్ వంటి అంశాలలో నైపుణ్యాభివృద్ధి కల్పించి, అనంతరం ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. 18 నుండి 35 సంవత్సరాల వయస్సు, 10వ తరగతి/ఇంటర్మీడియట్/డిగ్రీ (ఉద్యోగానికి అనుగుణంగా) దివ్యాంగులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, దివ్యాంగ ధృవీకరణ పత్రం (ఉంటే), పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, బయోడేటాతో జాబ్ మేళాకు హాజరు కావాలని వివరాలకు 7095612963 ను సంప్రదించాలన్నారు.

## టిపిసిసి ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శిగా నాగారం శంకర్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** టిపిసిసి ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన నాగారం శంకర్ ని ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ జాతీయ చైర్మన్ రాజేంద్ర గౌతం పాల్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగారం శంకర్ మాట్లాడుతూ నా నియమానికి కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎస్సీ సెల్ నేషనల్ కో ఆర్డినేటర్ నగరిగారి ప్రీతం, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి అధ్యక్షులు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎస్సీ డిపార్ట్మెంట్ టిపిసిసి అధికార ప్రతినిధి హెచ్‌ఆర్ మోహన్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యత ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసి తెలంగాణలో మరొకసారి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడేలా నిర్విరామ కృషి చేస్తామని అన్నారు.

## నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి: బీజేపీ



**ముద్ర, హుజూర్ నగర్ :** హుజూర్ నగర్‌లో నకిలీ విత్తనాలు, నకిలీ డీఏపీ, నాణ్యతలేని ఎరువులు అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారి స్వర్ణకు వినతిపత్రం అందజేశారు. రైతులను మోసం చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కూలీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి 'మాట-మంతి

**- సొంత ఊరు మార్గంలో పొలాల్లోకి వెళ్లిన భట్టి విక్రమార్క**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 20 :** వైరా నుంచి తన స్వగ్రామం స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ అకస్మాత్తుగా ఆగింది. భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యేలోపే, ఆయనే స్వయంగా రోడ్డు పక్కన పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతు కూలీల వైపు నడుచుకుంటూ వెళ్లారు. డిప్యూటీ సీఎం తమ వద్దకు రావడంతో కూలీలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. అక్కయ్యా.. పథకాలన్నీ అందుతున్నాయా? అంటూ పొలం గట్టుపై నిలబడి, కూలీలతో ఆత్మీయంగా భట్టి విక్రమార్క ముచ్చటించారు. నేరుగా లబ్ధిదారులతోనే సంక్షేమ ఫలాల తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కయ్యా! మన ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు అందుతున్నాయా?" మీ ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా వస్తోందా? రేషన్ షాప్ నుంచి సన్న బియ్యం తెచ్చుకుని తింటున్నారా?"
అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయా?" ఈ ప్రశ్నలకు కూలీలు ఎంతో సంతోషంగా స్పందిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ మాకు అందుతున్నాయి సార్.. ముఖ్యంగా మాలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఉప ముఖ్యమంత్రి దృష్టికి 'రవాణా' కష్టాలు ఇదే సమయంలో కూలీలు తమ రోజువారీ ఇబ్బందులను తీసుకువచ్చారు. వైరా నుంచి ముసలిమడుగు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క సమస్య పరిష్కరిస్తానని చెప్పారు.

### జాతీయ ఆహార భద్రత చట్ట సవరణలు

## విరమించుకోవాలి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జాతీయ ఆహార భద్రత చట్టానికి సవరణలు చేయాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, అలాగే 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ (ఆర్‌పీడీ) చట్టం ప్రకారం రాష్ట్ర వికలాంగుల సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సురూపంగా ప్రకాష్, ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ వికలాంగులు, పేదల హక్కులను పరిరక్షించే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి జిల్లా కోశాధికారి కొత్త లలిత, ఎన్ పి ఆర్ డి జిల్లా సభ్యులు గడ్డం యాదగిరి, కొలీలిపాక నాగయ్య, వస్తుప్పల మంజుల, ఏశాల గోపి, వల్లాల రాధాకృష్ణ, నూకల వెంకటేష్, స్వామి, వద్దే సుజాత పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణోత్సవం



ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి : విశ్వేశ్వరుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం శ్రీవారి వైభవోత్సవ మండపంలో అర్చక స్వాములు వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. సాయంత్రం ఆలయ మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

## ఎల్‌నినోను క్షేత్రస్థాయి వాస్తవాలతోనే ఎదుర్కోవాలి:

### డిప్యూటీ సీఎం భట్టి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతో సమర్థంగా ఎదుర్కోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో నిర్వహించిన సమీక్షలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వర్షపాతం లోటు, నీటి లభ్యత, సాగు పరిస్థితులపై అధికారులతో చర్చించారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగు చేయవద్దని, తక్కువ నీటితో సాగయ్యే పెసర, మినుములు, కందులు, అలసంద, చిరుధాన్యాల వంటి పంటలను ఎంచుకోవాలని సూచించారు. తాగునీటికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, గోదావరి జలాలను రాజీవ్ లింక్ కాలువ ద్వారా వినియోగించే అవకాశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా రైతులకు వాస్తవ పరిస్థితులపై నిరంతరం అవగాహన కల్పించాలని, నీటి లభ్యత ఆధారంగానే పంటల ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రైతు వేదికల ద్వారా గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి ఎల్‌నినో ప్రభావంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా భూ రీసర్వే



**కొండమల్లేపల్లి, ముద్రన్యూస్ :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పారదర్శకంగా భూ రికార్డులను డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ నరేందర్ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని వర్ధమానిగూడెం గ్రామంలో భూ సర్వేపై ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. క్షేత్రస్థాయిలో త్వరలోనే భూ రీ సర్వే ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో తరతరాలుగా వస్తున్న భూ వివాదాలు, సరిహద్దు తగాదాలకు ఈ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు ప్రతి సర్వే నంబరుకు భూధార్ ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వారివెంట మండల రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్, మండల సర్వేయర్స్, జిపిఓలు తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి



**కొండమల్లేపల్లి, ముద్రన్యూస్:** పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి మొక్కల కార్యక్రమం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఉత్సాహంగా జరిగింది. సోమవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రతి ఇంటికి రెండు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, ఉపసర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు గంట మల్లేష్, బిజిలి లింగయ్య, కొండల్, వస్కుల బక్కలయ్య, వస్కుల శ్రీను గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 21.07.2026
www.mudranews.in | @mudranews



**వానాకాలం చిట్కాలు**



రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోండి – పండ్లు, ఆకుకూరలు, విటమిన్-సి ఉన్న ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

# నకిలీ జర్నలిస్టులతో పెరుగుతున్న ముప్పు..

### అసలైన పాత్రికేయుల గౌరవానికి సవాల్

**ముద్ర, హైదరాబాద్:** సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత సమాచార ప్రసారం ఎంతో సులభమైంది. ఒక యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించడం, చిన్న వెబ్‌సైట్ ఏర్పాటు చేయడం లేదా సోషల్ మీడియా వేదికను నిర్వహించడం పెద్ద విషయం కాదు. అయితే ఇదే పరిస్థితిని కొందరు దుర్వినియోగం చేస్తూ తమను తాము "జర్నలిస్టులు"గా ప్రచారం చేసుకుంటున్నారు. జర్నలిజం అనేది సమాజానికి బాధ్యతాయుతమైన వృత్తి. కానీ కొందరు వ్యక్తులు ఈ వృత్తి పేరును అడ్డం పెట్టుకుని అక్రమ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ అసలు వృత్తులు కొనసాగిస్తూనే, పార్ట్‌టైమ్‌గా జర్నలిజం ముసుగులో అధికారులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడం, బెదిరింపులకు పాల్పడడం, అక్రమ వసూళ్లకు యత్నించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తరచూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం పటిష్టమైన నియంత్రణ వ్యవస్థ లేకపోవడమే. ఎవరు నిజమైన జర్నలిస్టులు? ఎవరు కేవలం జర్నలిస్టు పేరును వాడుకుంటున్నవారు? అనే అంశంపై స్పష్టత లేకపోవడం సమస్యను మరింత తీవ్రమయం చేస్తోంది. దీని ప్రభావం అత్యధికంగా నిజాయితీగా పనిచేస్తున్న పాత్రికేయులపై పడుతోంది. నకిలీ జర్నలిస్టుల చర్యల కారణంగా ప్రజల్లో మొత్తం మీడియాపై అనుమానాలు పెరుగుతున్నాయి. ఫలితంగా కష్టపడి వార్తలను సేకరించే నిజమైన జర్నలిస్టుల విశ్వసనీయత, గౌరవం దెబ్బతింటోంది. మరోవైపు అనేక మంది మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, సంక్షేమ పథకాలు అందకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. అయినప్పటికీ వారు ప్రజలకు వాస్తవాలను చేరవేయాలనే నిబద్ధతతో పనిచేస్తున్నారు.

# గ్రామాల్లోనే ప్రజాభిప్రాయం నిర్వహించాలి

**కంపెనీ కాలుష్యంపై గళమెత్తి ఆందోళన కలెక్టర్ గేటు వద్ద రెండు గ్రామాల ప్రజలు బైఠాయింపు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎం.ఎస్ అగర్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ స్టీల్ కంపెనీ విస్తరణను వెంటనే నిలిపివేసి, కంపెనీని గ్రామాల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం, రంగాయిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 400 మంది గ్రామస్థులు సోమవారం మెదక్ కలెక్టరేట్ గేట్ ముందు బైఠాయించారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు తరలివచ్చారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో గ్రామస్థులు అక్కడే బైఠాయించి ధర్నా నిర్వహించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో కలెక్టర్ స్వయంగా రెండు గ్రామాలకు వచ్చి ప్రజల సమక్షంలో ప్రజాభిప్రాయం నిర్వహించి, ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలన్నారు. లేదంటే వచ్చే సోమవారం వేలాది మందితో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ...గత 20 ఏళ్లుగా కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము, శబ్ద కాలుష్యంతో రెండు గ్రామాల ప్రజల జీవనం నరకప్రాయంగా మారిందని ఆందోళన చెందారు. నెలకు లక్ష క్వింటాళ్ల స్టీల్ ఉత్పత్తి కారణంగా కాలుష్యం తీవ్ర స్థాయికి చేరిందన్నారు. వర్షం పడితే నల్లటి నీరు కురుస్తోందని, చెరువులు, బోర్లు కలుషితమై తాగునీటికి పనికిరావడం లేదని, ప్రస్తుతం మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు.ఆరేసిన బట్టలు సాయంత్రానికి నల్లగా మారిపోతున్నాయని, మహిళలు, పిల్లలు చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, పంటలు దెబ్బతిని ప్రజలు సంపాదించిన డబ్బంతా ఆస్పత్రులకే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీని వెంటనే తొలగించాలని, అది సాధ్యం కాకపోతే రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావం: తాగునీటికే తొలి ప్రాధాన్యం

**– మంత్రి ఉత్తమ్**



**ముద్ర, హైదరాబాద్,:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే వచ్చే ఏడాది జూన్ వరకు తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పరిస్థితులు మరింత తీవ్రతరమైతే కర్ణాటకను సంప్రదించి కృష్ణా జలాలను తాగునీటి అవసరాల కోసం కోరే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, నీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నీటి వనరులు సంక్షోభ స్థాయికి చేరుకునే 20–25 రోజుల ముందే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ నిర్వహణ, తాగునీటి సరఫరా, ట్యాంకర్లు, బోర్‌వెల్లు సిద్ధంగా ఉంచాలని కూడా మంత్రి ఆదేశించారు.

## యూనియన్ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**- సిఐటియు జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనకు, నిరాహార దీక్షలకు మద్దతుగా సిఐటియు అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సిఐటియు సిద్దిపేట కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కామన్ గోపాల్ స్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్ష పేపరు లీక్ కావడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు, 8 మంది విద్యార్థులు ఆందోళనతో మరణించడం జరిగింది . ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించకుండా తన మంత్రి తన మంత్రివర్గంలోని మంత్రిని బర్తరఫ్ చేయకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీలో బిజెపి కార్యకర్తల ప్రమేయం ఉన్నదని ఇప్పటికే ప్రచారం జరిగిందని దీనిపైన దేశవ్యాప్తంగా విద్యార్థులు యువకులు, పెద్ద ఎత్తున నిరసనలు ర్యాలీలు కార్యక్రమాలు చేస్తున్నా కానీ ఈ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా మౌనం వహిస్తున్నదని మండిపడ్డారు. విద్యార్థుల పోరాటాలకు సిఐటియు మద్దతు తెలుపుతుందన్నారు. మంత్రి ధర్మంంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పోతిరెడ్డి రాజు బాబు నర్సింలు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ నే**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీలకు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు రైసోద్దీన్ (రాషాద్) అన్నారు. సోమవారం సిద్దిపేట లో అయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో సిద్దిపేట ఈద్గా మైదానంలో మాట ఇచ్చిన ప్రకారం సిద్దిపేటలో ముస్లింల కోసం రెండు ఎకరాలు 30 గుంటలు ఖబరస్తాన్ స్థలం అందజేశామన్నారు.ఇన్చార్జి మంత్రి వెంకటస్వామి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అతు ఇమామ్,లకు సిద్దిపేట మైనార్టీల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే హరీష్ రావు పది సంవత్సరాలు సిద్దిపేట మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని వదిలేశరని మండిపడ్డారు. సిద్దిపేటలో మైనార్టీల కోసం ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని అన్నారు.. మైనార్టీలంటే హరీష్ రావుకి ఎందుకు చిన్న చూపు అని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే తుతు మంత్రంగా మైనార్టీల కోసం హామీలు ఇచ్చి తర్వాత దాన్ని వదిలేసిన ఘనత హరీష్ రావుధన్నారు. అదేవిధంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ లకు అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మైనార్టీలకు ఎక్కువ శాతం టికెట్లు కేటాయించడం జరుగుతుందని రాషద్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి పెద్దపీట వేస్తుందని అని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సిద్దిపేట అభివృద్ధి చెందుతుందని ఇందిరా మైనార్టీ మహిళ యువజన పథకం కింద స్వయం ఉపాధి కోసం 50వేల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని అని అన్నారు. రేవంతన్న సహారా కింద వెనకబడిన వర్గాలకు వారి జీవనాధారం కోసం లక్ష రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సిద్దిపేట మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర వైస్ చైర్మన్ కలిముద్దీన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్షద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ అజ్మత్ అలీ, మైనార్టీ నాయకులు ఇమ్రాన్, కాంగ్రెస్ నాయకులు ఆతిఫ్, దస్తగీర్, శైబాస్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు చాకలి ప్రవీణ్ కు జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ. డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. నిందితుడు చాకలి ప్రవీణ్ అదే ప్రాంతానికి చెందిన 17 సంవత్సరాల ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఫలితంగా బాధిత బాలిక గర్భం దాల్చింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హవేలి ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఏఎస్సై డి. విఠల్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి, మెదక్ రూరల్ సీఐ పాలవెల్లి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలికకు సాక్ష్యం చెప్పే విషయంలో అవసరమైన సహకారం అందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించి, 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారి ఎస్సై విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీవో గౌస్ కేసులో సహకరించారు. ఈ కేసులో శిక్ష పడేవిధంగా కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

**ఫిర్యాదులపై తక్షణ చర్యలు...**

ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక, భూ వివాదాలు, మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను తెలియజేశారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.

## హరీశ్ రావు పాదయాత్ర ఉనికి కోసమే..

**టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి**




**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట :** మాజీ మంత్రి హరీశ్ రావు సిద్దిపేటలో చేపట్టిన పాదయాత్ర ఉనికిని చాటుకునేందుకు నిర్వహించిన రాజకీయ కార్యక్రమమేనని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రంతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మండిపడ్డారు.పాదయాత్రకు ప్రజలను రూ.500 నుంచి రూ.1,500 వరకు చెల్లించి తరలించారని, రైతుల పేరుతో పార్టీ కార్యకర్తలనే సమీకరించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేస్తున్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హరీశ్ రావు అనవసర విమర్శలు మానుకోవాలని, ప్రజలను, కార్యకర్తలను కూలీలుగా చూడొద్దని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాకి ఆనంద్,సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ తప్పెట శంకర్, మంద పాండు,పుట్ల యేసు, దేవయ్య, బయ్యారం యాదగిరి, ఐలేని యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన

**ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎల్ నీనో ప్రభావం నేపథ్యంలో అరుతడి పంటలపై రైతులకు అవగాహనా కల్పించాలని ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి డా. వివేక్ వెంకటస్వామి సూచించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సంగారెడ్డి, మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో టూరిజం శాఖ ప్రధాన కార్యదర్శి, మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి వాణి ప్రసాద్, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యరావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, అదనపు ఎస్పీ సంగారెడ్డి చైతన్ రెండు జిల్లాల ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని...ఈ పరిస్థితుల్లో రైతాంగం ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలన్నారు. నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... రైతులకు ఎల్ నినోపై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. పంట నష్టం జరిగిన రైతులకు, నష్టపోయిన రైతులకు, కొంత నష్ట పరిహారం చెల్లించాలన్నారు. 25 వేల రూపాయలు ఎకరానికి అందించే విషయాన్ని కేబినెట్లో చర్చించాలన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com